

సమ్మర్ వెకేషన్!

వేసవి సెలవుల వినియోగంపై రేపు అవగాహన కార్యక్రమాలు

- నైపుణ్యం పెంచుకునేలా విద్యార్థులకు సూచనలు
- ఉపాధ్యాయుల పర్యవేక్షణ ఉండేలా చర్యలు
- స్కూళ్లకు మార్గదర్శకాలు జారీ చేసిన విద్యాశాఖ

జనగామ కల్చరల్, ఏప్రిల్ 21: పాఠశాల విద్యార్థులకు వార్షిక పరీక్షలు పూర్తి కావస్తున్నాయి. ఇక మిగిలింది వేసవి సెలవులే. దీంతో విద్యార్థులు ఎంజాయ్ చేయడానికి సిద్ధపడ్డారు. ఈ క్రమంలో సెలవులను ఎంజాయ్ చేస్తూనే క్రమశిక్షణ, సామాజిక అవగాహన, వివిధ అంశాలపై విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవాలని విద్యాశాఖ అభిప్రాయపడుతోంది. ముఖ్యంగా పెరిగిన సాంకేతికత మూలంగా విద్యార్థులు సెల్ ఫోన్లకు బానిసలుగా మారుతున్నారు. మరికొందరు చెడు సహవాసాలు చేసి దుర్వ్యసనాలకు బానిసలవుతున్నారు. దీంతో ఆర్థిక పరంగా, ఆరోగ్య పరంగా, సామాజిక పరంగా మనిషి పతనమవుతున్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 'సమ్మర్ వెకేషన్' పేరిట విద్యాశాఖ ఓ కార్యక్రమాన్ని ప్రారంభించింది.

కాలక్షేపం వద్దు..

సంవత్సరం పాటు చదువుకునేందుకు గాను పాఠశాలకు వెళ్లిన విద్యార్థులు సెలవుల కోసం ఎదురు చూడడం సమంజసమే. అదే సమయంలో పూర్తిగా జ్ఞాన సముపార్జనను గాలికి వదిలేసి కాలక్షేపం చేయడం సరికాదని మేధావి వర్గాల అభిప్రాయం. ఇందుకు గాను ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు వేసవి సెలవుల్లో ఏం చేయాలి? ..ఏం చేయకూడదు.. అనే విషయాన్ని తెలియజేస్తూ సమ్మర్ వెకేషన్ కార్యక్రమాన్ని రూపొందించింది. ఈ నెల 23న పాఠశాల చివరి పనిదినం కావడంతో అదే రోజున ఒక గంట పాటు విద్యార్థులకు ఈ విషయమై శిక్షణ కల్పిస్తారు. అనంతరం వేసవి సెలవుల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేయాలని విద్యార్థులను కోరుతారు. కార్యక్రమం అమలు పట్ల ఉపాధ్యాయుల పర్యవేక్షణ కూడా ఉంటుంది. దీనిపై ఉన్నతాధికారులకు ఆన్‌లైన్ రిపోర్టులు కూడా పంపించాల్సి ఉంటుంది.

విద్యార్థులు చేయవలసినవి ..

విద్యార్థులు ఉదయం త్వరగా మేల్కొనాలి. యోగా, ధ్యానం, వాకింగ్ చేయాలి. పెయింటింగ్, డ్యాన్స్, సంగీతం, పబ్లిక్ స్పీకింగ్ వంటి కొత్త నైపుణ్యాన్ని నేర్చుకోవడం ప్రారంభించాలి. ఉదయం, సాయంత్రం వేళల్లో ఆటలు, క్రీడలు మొదలగు శారీరక శ్రమ చేయాలి. గ్రంథాలయాన్ని సందర్శించి పుస్తకాలు చదవాలి. గంట సేపు రైటింగ్ ప్రాక్టీస్ చేయాలి. బంధువుల ఇళ్లల్లో కొద్ది రోజులు గడపాలి. వారితో వరుసలు కలుపుతూ మాట్లాడాలి. జాతర లాంటి సామూహిక కార్యక్రమాల్లో వలంటీర్లుగా పాల్గొనాలి. అమ్మమ్మ, తాతయ్యల జీవిత అనుభవాలు, వారు చెప్పే కథలు, మంచి విషయాలు శ్రద్ధగా వినాలి. సైకిల్ తొక్కడం, ఈత కొట్టడం వంటివి నేర్చుకోవాలి. మజ్జిగ, నిమ్మరసం, మంచి నీరు బాగా తాగాలి. రాత్రి 10 గంటలకు తప్పనిసరిగా నిద్రపోవాలి.

చేయకూడనివి ...

పొద్దు పోయేదాకా పడుకోరాదు. వీడియో గేమ్‌లు, మొబైల్ గేమ్‌లు ఆడేందుకు సమయం వృథా చేయవద్దు. మొబైల్ ఫోన్లలో వాట్సాప్, యూట్యూబ్ అతిగా చూస్తూ సోషల్ మీడియాకు బానిస కావద్దు. ఎండ ఎక్కువగా ఉన్న సమయాల్లో బయటకు వెళ్లరాదు. ఇండోర్ గేమ్స్ ఆడుకోవాలి. సెలవుల్లో సోమరితనంగా కాకుండా చురుగ్గా ఉండాలి. పెద్ద వాళ్లకు చెప్పకుండా ఎక్కడికీ వెళ్లకూడదు. చెడు వ్యసనాలు ఉన్న వారితో స్నేహం చేయకూడదు. కొట్లాటలు, గొడవలకు దూరంగా ఉండాలి. టీవీలు, సెల్ ఫోన్లు చూస్తూ అర్ధరాత్రి వరకు గడపకూడదు.

జిల్లాలో 527 పాఠశాలలు...

జిల్లాలో 103 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు. 12 కేజీబీవీ లు, 8 మోడల్ స్కూళ్లు. 64 ప్రాథమికోన్నత పాఠశాలలు, 341 ప్రాథమిక పాఠశాలలు, 19 సంక్షేమ గురుకుల పాఠశాలలతో మొత్తం 527 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా వాటిలో సుమారు 30 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరందరికీ ఈ నెల 23న సెలవుల వినియోగంపై అవగాహన కల్పిస్తారు.

విద్యార్థులు నైపుణ్యం పెంపొందించుకోవాలి..

- బొమ్మరబోయిన శ్రీనివాస్, ఏఎం, జనగామ




వేసవి సెలవుల్లో విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి. చదువుకు విరామంగా భావించకూడదు. సెలవులు అంటే సరదాగా, ఆనందంగా మంచి నైపుణ్యాలను నేర్చుకునే సమయమని భావించాలి. ఈ విషయమై ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించాలి.

ఉపాధ్యాయుల పర్యవేక్షణ ఉండాలి..

- కే.రాము, డీఈవో



ఈ నెల 23న పాఠశాల చివరి పనిదినం రోజున విద్యార్థులకు చేయవలసిన, చేయకూడని పనులపై అవగాహన కల్పించాలి. అనంతరం వారికి ఆన్‌లైన్ మెమోలు అందించాలి. వేసవి సెలవుల్లో విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకునేలా ఉపాధ్యాయులు ఉద్బోధించాలి. పాఠశాల గ్రంథాలయం నుంచి విద్యార్థులు తీసుకెళ్లిన పుస్తకాన్ని సద్వినియోగం చేసుకున్నాడా అని ఉపాధ్యాయులు తెలుసుకోవాలి. ఉపాధ్యాయులు సేకరించిన విషయాన్ని ఎప్పటికప్పుడు పై అధికారులకు తెలియజేయాలి.



కడియం శ్రీహరిని కొనే దమ్ము ఎవరికీ లేదు!

- ఏ రకమైన అవినీతి మరక లేదు.. భూకబ్జాలు, కాంట్రాక్టులు లేవు
- కేసీఆర్‌కు భక్తి ఎక్కువ.. కావ్యకు పార్టీ ఫండ్ ఇచ్చినట్లు ప్రమాణం చేస్తారా..?
- నా వ్యక్తిత్వాన్ని డ్యామేజ్ చేసేందుకు తప్పుడు ప్రచారం
- నా రాజకీయ జీవితం తెరిచిన పుస్తకం
- కడియం కావ్యది షెడ్యూల్ కులం.. హిందూ మహిళే..
- బీఆర్ఎస్‌కే కాదు ఎవరికీ ఎప్పుడూ ద్రోహం చేయలేదు.. చేయను కూడా..
- వరంగల్ లోక్‌సభ పరిధిలో కాంగ్రెస్ బలంగా ఉంది.. కావ్య గెలుపు పక్కా
- ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి

వివరాలు : 7 లో..

"కడియం శ్రీహరి ఎన్నడు కూడా డబ్బులకు అమ్ముడు పోయే వ్యక్తి కాదు. 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఏ ఒక్క అవినీతి మరకలేదు.. భూ కబ్జాలకు పాల్పడలేదు.. దందాలు చేయలేదు.. నా వ్యక్తిత్వాన్ని డ్యామేజ్ చేసేందుకు ఇలాంటి ప్రచారం చేస్తున్నారు. నా రాజకీయ జీవితం తెరిచిన పుస్తకం" అని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. బీఆర్ఎస్‌కు ఎవరూ లేకపోవటం వల్లే కావ్యకు టికెట్ ఇచ్చారని, పార్టీ ఫండ్ తీసుకున్నట్లు నిరూపిస్తే రాజీనామాకు సిద్ధమని అన్నారు. కావ్య కులాన్ని, మతాన్ని వివాదం చేయడం తదితర అంశాలను 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో కడియం ప్రస్తావించారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

ఢిల్లీకి బైలెల్లిన గడ్డం సమ్మయ్య

- నేడు పద్మశ్రీ పురస్కారం అందించనున్న రాష్ట్రపతి



శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి కుటుంబ సభ్యులతో కలిసి ఢిల్లీ వెళ్తున్న గడ్డం సమ్మయ్య

దేవరుప్పుల, ఏప్రిల్ 21: చిందు యక్షగాన కళాకారుడు, కళారత్న, హంస అవార్డు గ్రహీత, పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన గడ్డం సమ్మయ్య తన కుటుంబసభ్యులతో ఆదివారం ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. సోమవారం సాయంత్రం ఆయన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా రాష్ట్రపతి భవన్‌లో పద్మశ్రీ పురస్కారాన్ని అందుకుంటారు. ఈ సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ఫోన్‌లో మాట్లాడారు. గతంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో అనేక ప్రదర్శనలు ఇచ్చానన్నారు. 1990 నుంచి జనగామ జిల్లా ఏర్పడేంత వరకు వివిధ ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలతో పాటు అక్షరాస్యత వంటి అనేక కార్యక్రమాల్లో ప్రదర్శనలు ఇచ్చానన్నారు. దూరదర్శన్, ఆలిండియా రేడియోతో పాటు మధ్యప్రదేశ్, భిలై, చెన్నై, కర్ణాటక, తంజావూరు, మధురై, హంపి, బెంగళూరు. సోలాపూర్, ఢిల్లీలోని బీదర్, హర్యానా, అయోధ్యలో కూడా ప్రదర్శనలు ఇచ్చానన్నారు. పేదరికంలో జన్మించిన తాను ఎన్నో ఒడుదొడుకులను అధిగమించి కూడు, గూడు, కుటుంబం కోసం పడని కష్టం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తనను గుర్తించినందుకు సంతోషం వ్యక్తం చేశారు. పద్మశ్రీ ఎంపిక కోసం రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు చేయడం ఎప్పటికీ మరువలేనన్నారు. రాష్ట్రపతి చేతులమీదుగా దేశ రెండో అత్యున్నత పురస్కారాన్ని తాను అందుకోబోతున్నందుకు ఆనందంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన స్వగ్రామమైన దేవరుప్పుల మండలం అప్పిరెడ్డిపల్లెతో పాటు, జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

భువనగిరికి తరలిన కాంగ్రెస్ శ్రేణులు



జనగామ నుంచి భువనగిరికి తరలి వెళ్తున్న కాంగ్రెస్ శ్రేణులు

జనగామ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): భువనగిరి కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆదివారం భారీగా తరలివెళ్లారు. కాంగ్రెస్ నేత కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి, నియోజకవర్గ కోఆర్డీనేటర్ భవానీరెడ్డి ఆధ్వర్యంలో వివిధ మండలాలకు చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వాహనాల్లో వెళ్లారు. ఈ వాహనశ్రేణిని కొమ్మూరి ప్రశాంత్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భువనగిరిలో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమని అన్నారు. భువనగిరికి తరలి వెళ్లిన వారిలో జనగామ పట్టణ, నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

భువనగిరి సీటు కాంగ్రెస్‌దే: కొమ్మూరి

బచ్చన్నపేట: భువనగిరి ఎంపీ సీటు కాంగ్రెస్ పార్టీదేనని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆదివారం చామల్ల కిరణ్‌కుమార్‌రెడ్డి నామినేషన్‌కు బచ్చన్నపేట మండలం నుండి పెద్ద ఎత్తున నాయకులు తరలివెళ్లారు. వాహన ర్యాలీని కొమ్మూరి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపుకోసం కలిసికట్టుగా పనిచేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. మండల అధ్యక్షులు నూకల బాల్‌రెడ్డితో పాలు మండల, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో బీజేపీ పోస్టర్లు



నమిలిగొండ ప్రభుత్వ పాఠశాలలో అంటించిన బీజేపీ వాల్‌పోస్టర్లు

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 21: నమలిగొండ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో బీజేపీ పోస్టర్లు వెలిశాయి. వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేష్‌కు మద్దతుగా ఆదివారం వాల్ పోస్టర్లను అంటించారు. దీనిపై వివిధ పార్టీలకు చెందిన నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పోస్టర్లు అంటించిన వారిపై ఎన్నికల నియమావళి ఉల్లంఘన కింద చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రతీ గింజను కొనుగోలు చేస్తాం

కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ కల్చరల్, ఏప్రిల్ 21: అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యంలో ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. ఆదివారం ఆయన కలెక్టరేట్‌లో యాసంగి 2023-24కు సంబంధించి ధాన్యం కొనుగోళ్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇటీవల ఈదురుగాలులుతో కూడిన భారీ వర్షం కారణంగా పలు కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తడిసిందని, ఈ విషయంలో రైతులు అధైర్య పడవద్దని, ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామని భరోసా ఇచ్చారు. ఇప్పటి వరకు జిల్లాలో 195 కొనుగోలు కేంద్రాలు తెరిచామని, అందులో 180 కేంద్రాలలో కొనుగోళ్లు ప్రారంభమయ్యాయని అన్నారు. ఇప్పటి వరకు 4382 మంది రైతుల నుంచి 24,423 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని, అన్ని కేంద్రాలలో సరిపడా టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉన్నాయని, అకాల వర్షాల వల్ల అవసరమైన చోట్ల కవర్లు సమకూర్చాలని మార్కెటింగ్ శాఖను ఆదేశించామని అన్నారు. జాప్యం లేకుండా ధాన్యం కొనుగోలు చేసి వెంటవెంటనే రైస్ మిల్లులకు తరలించాలని, మాయిశ్చర్ వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో అధికారులు ఎప్పటికప్పుడు కొనుగోళ్లను పర్యవేక్షించాలన్నారు. రైస్ మిల్లర్లు ధాన్యంలో ఎలాంటి కోతలు పెట్టరాదన్నారు. అకాల వర్షానికి చిలుపూరు మండలం పల్లగుట్ట కొనుగోలు కేంద్రంలో 167 ధాన్యం బస్తాలు పాక్షికంగా తడవగా, నర్మెట మండలం బొమ్మకూరు కొనుగోలు కేంద్రంలో 25 బస్తాలు స్వల్పంగా తడిశాయని అన్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు.

చెక్‌పోస్ట్ వద్ద నగదు స్వాధీనం



పట్టుకున్న నగదుతో పోలీసులు

జనగామ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.1.80 లక్షల నగదును జనగామ మండలం పెంబర్తి చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు ఆదివారం సాయంత్రం పట్టుకున్నారు. స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన ముశిని వంశీ బైక్‌పై డబ్బుతో వెళ్తుండగా జనగామ పోలీసులు, సెంట్రల్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. నగదుకు సంబంధించి ఎలాంటి ధ్రువ పత్రాలు చూపకపోవడంతో సీజ్ చేసి ఎన్నికల త్రీమెన్ కమిటీకి పంపినట్లు జనగామ ఎస్సైలు సృజన్, తిరుపతి తెలిపారు. సరైన ధ్రువపత్రాలు చూపించి త్రీమెన్ కమిటీ నుంచి నగదును విడిపించుకోవచ్చని వారు తెలిపారు.

నర్మెటలో రూ. 1.38 లక్షలు సీజ్

నర్మెట: మండల కేంద్రంలోని ఎస్టీ ఆశ్రమ పాఠశాల వద్ద పోలీసులు రూ. 1.38 లక్షల నగదును సీజ్ చేశారు. యాద్రాద్రిభువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం గ్రామానికి చెందిన ఎర్రోళ్ల యాదయ్య అనే వ్యక్తి తన కారులో రూ. 1.38 లక్షలు తీసుకెళ్తుండగా పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డాడు. వాటికి సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేసినట్లు చేసినట్లు సీఐ సాయిరమణ తెలిపారు. తనిఖీలో స్థానిక ఎస్సై శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఎంసీహెచ్‌లో కూలర్ల ఏర్పాటు



కొనుగోలు చేసిన కూలర్లు

జనగామ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జనగామ మండలం పసరమడ్ల శివారులోని మాతాశిశు సంరక్షణ కేంద్రంలో అధికారులు ఎట్టకేలకు కూలర్లు ఏర్పాటు చేశారు. ఆస్పత్రికి నెలవారీ చెకప్‌ల కోసం వచ్చే గర్భిణులు, బాలింతలకు ఉక్కపోత నుంచి ఉపశమనం కలిగించేందుకు నాలుగు కూలర్లను కొనుగోలు చేశారు. ఆస్పత్రిలో కూలర్లు, ఫ్యాన్లు లేకపోవడంతో ఓపీ విభాగం వద్ద గర్భిణులు పడిన ఇబ్బందులపై ఈనెల 20న 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో "అమ్మ'లకు అవస్థ' అనే శీర్షికతో వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు నాలుగు కూలర్లను కొనుగోలు చేసి ఆస్పత్రిలో ఏర్పాటు చేశారు.

అమెరికాలో రోడ్డు ప్రమాదం.. స్టేషన్‌ఘన్‌పూర్ యువకుడు మృతి

- ఉన్నత చదువు కోసం అమెరికా వెళ్లిన గౌతమ్



గౌతమ్ (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 21: స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ పరిధిలోని శివునిపల్లి పట్టణానికి చెందిన యువకుడు పార్శి గౌతమ్(19) శనివారం అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వ్యాపారి పార్శి కమల్‌కుమార్-పద్మ దంపతుల కుమారుడు గౌతమ్ ఇంటర్ పూర్తి కాగానే బీటెక్ చదివేందుకు ఏడాదిన్నర క్రితం అమెరికాలోని అరిజోనా రాష్ట్రానికి వెళ్లాడు. ప్రస్తుతం బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. అమెరికా కాలమానం ప్రకారం శనివారం వీకెండ్ కావడంతో స్నేహితులతో కలిసి జలపాతం చూసేందుకు వెళ్లాడు. తిరిగి అరిజోనాలో తాను నివాసం ఉంటున్న ఇంటికి వెళుతున్న క్రమంలో వెనుకాల నుంచి వచ్చిన కారు వీరు ప్రయాణిస్తున్న కారును ఢీకొట్టింది. దీంతో కారు వెనుక సీట్లో కూర్చున్న గౌతమ్‌తో పాటు కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పట్టణానికి చెందిన ముక్క నివేష్ అనే విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందారు. అరిజోనా పోలీసులు గౌతమ్ తండ్రి పార్శి కమల్‌కుమార్‌కు సమాచారం అందించారు. కాగా గౌతమ్ మృతదేహం అమెరికా నుంచి శివునిపల్లి పట్టణానికి రావడానికి మూడు రోజుల సమయం పట్టే అవకాశం ఉందని సమాచారం.

గౌతం కుటుంబాన్ని పరామర్శించిన అరూరి

వరంగల్ క్రైం: అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పార్శి గౌతంకుమార్ కుటుంబ సభ్యులను బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ పరామర్శించారు. శివునిపల్లి గ్రామానికి చెందిన పార్శి కమల్‌కుమార్ గుప్త, పద్మ దంపతులకు ఇద్దరు కుమారులుగా కాగా గౌతంకుమార్ పై చదువుల కోసం అమెరికా వెళ్లాడు. ఆదివారం పార్శి గౌతంకుమార్ తన మిత్రుడు హుజురాబాద్‌కు చెందిన ముక్కా నివేష్‌తో కలిసి కారులో వెళుతుండగా వెనుక నుంచి కారు ఢీ కొట్టడంతో ఇద్దరు మృతి చెందారు. స్టేషన్‌ఘనపూర్‌లో బంగారం షాపు నడుపుతున్న గౌతంకుమార్ తల్లిదండ్రులు హనుమకొండ వడ్డెపల్లిలోని బృందావన్ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నారు. కుమారుడి మృతి వార్త తెలియడంతో గౌతంకుమార్ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మూడు మాసాల క్రితం వచ్చి వెళ్లిన గౌతంకుమార్ వచ్చే మాసంలో వస్తానని చెప్పినట్లు తల్లిదండ్రులు తెలిపారు. గౌతంకుమార్ కుటుంబ సభ్యులను బీజేపీ నేత మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్‌తో పాటు డీసీసీబీ డైరెక్టర్ రాజేశ్వర్‌రెడ్డి, గొరంటల బలరాం తదితరులు పరామర్శించి ఓదార్చారు. గౌతంకుమార్ మృతదేహాన్ని తొందరగా తీసుకువచ్చేందుకు తనవంతు సహకారం అందిస్తానని తెలిపిన అరూరి రమేశ్ కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కు కాల్ చేసి మాట్లాడారు. తొందరగా రప్పించేందుకు సహకరించాలని అరూరి రమేశ్ కోరారు.

కోడ్ ఉల్లంఘిస్తే... విజిలేయండి!

- ఎన్నికల్లో అక్రమాల కట్టడికి 'సీ-విజిల్' యాప్
- వంద నిమిషాల్లో ఫిర్యాదు పరిష్కారం
- ఎక్కడి నుంచైనా ఫిర్యాదు చేసే అవకాశం

జఫర్‌గడ్, ఏప్రిల్ 21: సార్వత్రిక ఎన్నికల సమరానికి సమయం ఆసన్నమైంది. ఎన్నికలకు సంబంధించి కీలక ఘట్టమైన నామినేషన్ల పర్వం ఈ నెల 18 నుంచి ప్రారంభమైంది. ఇక ఎన్నికల ప్రచారం వేడెక్కుతోంది. ఉమ్మడి జిల్లాలోని రెండు పార్లమెంటు స్థానాలకు ప్రధాన పార్టీలు అభ్యర్థులను ప్రకటించడంతో ప్రచారంపై దృష్టి సారించారు. ఓటరును ప్రలోభపెట్టేందుకు.. గెలుపు సాధించేందుకు అభ్యర్థులు రకరకాల పన్నాగాలు పన్నుతుంటారు. వివిధ రూపాల్లో తాయిలాలు అందించేందుకు ప్రణాళికలు రచిస్తుంటారు. వీటన్నింటినీ అడ్డుకట్ట వేయడం ఎన్నికల సంఘానికి కత్తిమీద సాములా మారుతోంది. ప్రజల భాగస్వామ్యంతో ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం 2014 ఎన్నికల్లో సీ-విజిల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ యాప్ పాతదే అయినా.. దీనిని పూర్తిగా ఆధునీకరించి అందుబాటులోకి తీసుకువచ్చారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) ఉల్లంఘనలపై కొరడా ఝుళిపించేందుకు రంగం సిద్ధమైంది. ఈ యాప్ ద్వారా అధికారులకు ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటారు. ఇంకెందుకు ఆలస్యం.. ఈరోజే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, ఎక్కడైనా ఎన్నికల ఉల్లంఘన కనిపిస్తే తెలియజేయండి. అక్రమాలకు అడ్డుకట్ట వేయండి. భావితరాల భవిత కోసం మీ వంతు బాధ్యతను నిర్వర్తించండి.



ఏఏ అంశాలపై ఫిర్యాదు చేయవచ్చో తెలుపుతున్న సీ-విజిల్ యాప్

ముందు ఏం చేయాలి...?

ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలంటే ముందుగా స్మార్ట్ ఫోన్‌లో గూగుల్ ప్లే స్టోర్ ఓపెన్ చేసి కేంద్ర ఎన్నికల సంఘం ప్రవేశపెట్టిన సీ-విజిల్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఆ తరువాత మీ ఫోన్ నంబరు ద్వారా రిజిస్టర్ చేసుకోవాలి. అపుడు ఓటీపీ వస్తుంది. దాన్ని నమోదు చేస్తే యాప్ మీ ఫోన్‌లో సిద్ధమవుతుంది. ఆ తరువాత దాని ద్వారా మీరు ఎన్నికల అక్రమాలపై ఫిర్యాదు చేయవచ్చు.



గోప్యంగా వివరాలు...

యాప్ ఓపెన్ చేయగానే స్క్రీన్‌పై ఫోటో, వీడియో, ఆడియో అనే మూడు ఆప్షన్లు కనిపిస్తాయి. ఫోటో ఆధారంగా ఫిర్యాదు చేయాలనుకుంటే ఫోటో ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి. అపుడు మీ లోకేషన్ నమోదవుతుంది. అనంతరం ఉల్లంఘనకు సంబంధించిన చిత్రాన్ని అప్‌లోడ్ చేయాలి. ఏ రాష్ట్రం, ఏ నియోజకవర్గం, తదితర వివరాలను కూడా పొందుపరచాలి. సదరు ఉల్లంఘనకు సంబంధించి క్లుప్తంగా వివరణ రాయాలి. ఇది ఎన్నికల అధికారులకు చేరిన తరువాత ప్రత్యేక గుర్తింపు సంఖ్యను కేటాయిస్తారు. ఫిర్యాదు వివరాలను గోప్యంగా ఉంచుతారు.

అక్రమాలకు అడ్డుకట్ట వేయొచ్చు...

ఎన్నికల ప్రవర్తనా నియమావళికి భిన్నంగా ఉన్న ఏ విషయంపై అయినా ఈ సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. నగదు, మద్యం

మిగతా 8వ పేజీలో..

కోడ్ వేళ తస్మాత్ జాగ్రత్త

- వాహనాల తనిఖీని అడ్డుకోకూడదు
- రాజకీయ పార్టీలు ఊరేగింపులు, ర్యాలీలు చేసుకోవచ్చు
- రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయవద్దు

వరంగల్ సిటీ, ఏప్రిల్ 21 : ఎన్నికల ప్రచారం ఇప్పుడిప్పుడే ఊపందుకుంటుంది. ఇప్పటికే ఎన్నికల నియమావళి(మాడల్ కోడ్ ఆఫ్ కండక్ట్)ను పకడ్బందీగా అమలు చేసేందుకు ఎన్నికల అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. నియోజకవర్గాల వారీగా ప్రత్యేక బృందాలను నియమించి వాహన తనిఖీలు చేస్తున్నారు. ప్రచార కార్యక్రమాలు, సభలు, సమావేశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. బ్యాంకుల లావాదేవీలపై నిఘా పెడుతున్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు సైతం నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

వాహనాల తనిఖీని అడ్డుకోకూడదు..

ఎన్నికల కోడ్ అమలులో ఉన్న క్రమంలో అధికారులు విస్తృతంగా తనిఖీలు చేస్తుంటారు. వాహనాలను ఆపి పూర్తిగా పరిశీలిస్తారు. దీనిని అడ్డుకునే అధికారం ఎవరికీ లేదు. వాహనాల్లో నిషేధిత వస్తువులు ఉంటే వాటిని స్వాధీనం చేసుకుంటారు. పరిమితికి మించి డబ్బులు ఉంటే లెక్కలు,ఆధారాలు చూపాలని, మద్యం ఉంటే వాహనంతో సీజ్ చేస్తారు. సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తారు.

చేయకూడనివి..

- రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్ స్పీకర్లు వినియోగించరాదు.
- పోలింగ్ రోజున ఓటర్ల రవాణాకు వాహనాలు ఉపయోగించకూడదు.
- అనుమతి లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించరాదు.
- ఎన్నికల ఫలితాలపై సర్వేలు, ఎగ్జిట్ పోల్స్‌పై నిషేధం.
- ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకూడదు.
- పోలింగ్ కేంద్రాల్లోకి అక్రమంగా చొరబడడం, ఈవీఎం, ఇతర దస్త్రాలను తొలగించడం నేరం
- తప్పుడు ప్రకటనలు, పేయిడ్ న్యూస్‌కు అనుమతి లేదు. తాత్కాలిక, శాశ్వత ఉద్యోగుల నియమాకాలు చేయరాదు.
- కోడ్ అమలులో ఉన్నప్పుడు ప్రజాప్రతినిధులు అధికారులను సమీక్షలు, సమావేశాలకు పిలవకూడదు.
- పోలింగ్‌కు 48 గంటల ముందు నుంచే ప్రచారాలు ఆపేయాలి.
- నామినేషన్లు వేసేటప్పుడు మూడు వాహనాలను, కేవలం ఐదుగురిని మాత్రమే ఆర్వో కార్యాలయంలోనికి అనుమతిస్తారు.

చేసుకోదగినవి..

- న్యాయస్థానం అనుమతి ఉన్న ఉద్యోగ నియమాకాల ప్రక్రియను పూర్తి చేయవచ్చు.
- కరువు నివారణ పనులను చేపట్టవచ్చు. కరువు ప్రాంతాలకు ఆహార సరఫరా చేయవచ్చు.
- ప్రత్యర్థి పార్టీ విధి విధానాలను విమర్శించవచ్చు. రాజకీయ పార్టీలు ముందస్తు అనుమతితో ఊరేగింపులు, ర్యాలీలు చేయవచ్చు.

ప్రచారంలో ఇవి చేయవద్దు..

- ప్రజల మధ్య శతృత్వం పెరిగేలా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయరాదు.
- మతపరమైన ప్రార్థనామందిరాల్లో, కులం, మతం, ప్రాంతం, వర్గం, జాతి విభేదాలు వంటి సున్నితమైన అంశాలతో ప్రచారం చేయవద్దు.
- అనుమతి ఉన్న వాహనాల్లో మాత్రమే వెళ్లి ప్రచారం చేయాలి. ఇందులో ఐదుగురికంటే ఎక్కువగా ప్రయాణించకూడదు.

కోలాహలంగా జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు



జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్ 21: జిల్లా అథ్లెటిక్స్ ఆధ్వర్యంలో హనుమకొండలోని జేఎన్ఎస్‌లో జిల్లాస్థాయి అథ్లెటిక్స్ క్రీడా ఎంపిక పోటీలు ఆదివారం కోలాహలంగా ప్రారంభమయ్యాయి. అండర్-14 బాలబాలికల విభాగంలో 100, 600 పరుగు పందెంతో పాటు అండర్-16 విభాగంలో 100, 400, 800, 2వేల మీటర్ల పరుగు పందెంలో ఎంపిక పోటీలు నిర్వహించడం జరిగిందని అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సారంగపాణి తెలిపారు. అదే విధంగా అండర్-18 బాలబాలికల విభాగంలో 100, 400, 800, 1500, 5000 మీటర్స్‌తోపాటు అండర్-20 బాలికలకు 100, 400, 800, 1500, 5000, మెన్ అండ్ ఉమెన్ విభాగంలో ఎంపిక పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎంపిక పోటీల్లో 150 మంది బాలబాలికలు పాల్గొన్నట్లు సారంగపాణి తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఈ నెల 28న సూర్యపేట జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ కోచ్‌లు, టెక్నికల్ అఫీషియల్స్ అసోసియేషన్ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి రైతు మృతి

▸▸ మహబూబాబాద్ మండలం ఉత్తరతండాలో ఘటన



బోడ రమేష్ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 21 : ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి యువ రైతు మృతి చెందిన ఘటన ఉత్తరతండాలో ఆదివారం చోటు చేసుకుంది. మానుకోట రూరల్ ఎస్సై దీపికరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... ఉత్తరతండాకు బోడ కిషన్-కమ్లీ దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. వారికున్న 2.20 ఎకరాల్లో వరిపంటను సాగు చేశారు. ఈ క్రమంలో వరిపంటకు నీరు పెట్టేందుకు వ్యవసాయ బావి వద్దకు తండ్రి బోడ కిషన్‌తో కలిసి కుమారుడు బోడ రమేష్(35) వెళ్లాడు. మోటారుకు లెవల్ ఆగడంలేదని పైపును కదిలిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు పైపుఊడి పక్కనే ఉన్న బావిలో పైపుతో సహా కుమారుడు రమేష్ పడ్డాడు. ఇది గమనించిన తండ్రి కిషన్ కొడుకును కాపాడుకునేందుకు తాను కట్టుకున్న ధోతిని విప్పి కొడుకుకు అందించే ప్రయత్నం చేసినప్పటికీ రమేష్‌కు ఈతరాకపోవడంతో బావిలో మునిగి మృతి చెందాడు. కన్న కొడుకు కళ్లముందే మృతి చెందడంతో కిషన్ బోరున విలపించాడు. మృతుడు రమేష్‌కు భార్య సరిత, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి తండ్రి కిషన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దీపికరెడ్డి తెలిపారు. విషయం తెలుసుకున్న మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత ఉత్తరతండాకు చేరుకుని రమేష్ మృతదేహంపై పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు.

ఎన్‌కౌంటర్‌పై న్యాయవిచారణ జరిపించాలి

▸▸ సీపీయూఎస్ఐ పార్టీ దళిత బహుజన శ్రామిక విముక్తి నేత వెంకన్న

మహబూబాబాద్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో ఈ నెల 16న జరిగిన ఎన్‌కౌంటర్‌పై న్యాయవిచారణ జరిపించాలని సీపీయూఎస్ఐ పార్టీ దళిత బహుజన శ్రామిక విముక్తి తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి దైద వెంకన్న అన్నారు. ఆయన పేరిట 'ఆంధ్రజ్యోతి' కార్యాలయానికి ఆదివారం పంపిన లేఖలో పలుఅంశాలను పేర్కొన్నారు. దేశంలో ఖనిజ సంపదను బహుళజాతి సంస్థలకు అప్పగించడం కోసమే నరహంతక బీజేపీ, మోదీ, అమిత్‌షాలు ఆదివాసీ గిరిజన ప్రాంతాల్లో దండ కారణ్యంలోకి వేలాది సోల్జర్, బలగాలను దింపి అమాయక ఆదివాసీ బిడ్డలను నిర్బంధించి హింసిస్తూ, హత్యలు చేస్తున్నారన్నారు. మరోపక్క మావోయిస్టు సభ్యులను పార్టీ అంతర్గత సమాచారం కోసం చిత్రహింసలు పెట్టి కాల్చిచంపి బూటకపు ఎన్‌కౌంటర్ చేస్తూ ఎదురు కాల్పుల్లో మావోయిస్టు ఎన్‌కౌం టర్ అంటూ కట్టుకథలు అల్లుతున్నారని ఆరోపించారు. హిడ్మా ఆపరేషన్ అంటూ ఒక విప్లవకారుడి కోసం వందల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఇన్‌ఫార్మర్ వ్యవస్థకు, పోలీస్ వ్యవస్థకు ఖర్చు చేస్తూ వృథా చేస్తున్నారని చెప్పారు.

నిజంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల అభ్యున్నతికి పాటు పడాలనే తపన పాలక వర్గాలకు ఉన్నట్లయితే నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని, పేదలకు సంక్షేమ ఫలాలను అందించాలని, పేదల అభివృద్ధి ముఖ్యం కాదు.. కేవలం విప్లకారులని అంతం చేయడమే ముఖ్యమన్నట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని దైద వెంకన్న చెప్పారు. 15 రోజుల్లో 70 మందిని ఎన్‌కౌంటర్ల పేరిట హత్య చేశామని అమిత్‌షా పత్రిక ముఖంగా ప్రకటించడం సమాజం గమనించాలన్నారు. దేశంలో ఇంత శాతం విద్య, ఇంత శాతం వైద్యం, ఇంత మందికి ఉద్యోగాలు కల్పించామని, పది సం వత్సరాల్లో చెప్పలేని మోదీ, అమిత్‌షాలు 70 మంది ఆదివాసీ బిడ్డల్ని హత్య చేశామని చెప్పడం సిగ్గు చేటన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు మతోన్మాద ఫాసిస్టు బీజేపీ, మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలన్నారు. వెంటనే ఛత్తీస్‌ఘడ్ అడవుల్లో ఉన్న పోలీస్ బలగాలను వెనక్కి రప్పించి, కూంబింగ్‌ను నిలిపివేయాలన్నారు. అమాయక ఆదివాసీ బిడ్డలను బూటకపు ఎన్‌కౌంటర్లలో హత్య చేసిన పోలీసులకు శిక్షపడేలా సుప్రీంకోర్టు న్యాయమూర్తిచే న్యాయవిచారణ జరిపించాలన్నారు. ఛత్తీస్‌ఘడ్ ఎన్‌కౌంటర్లను అన్ని విప్లవశక్తులు, వామపక్షాలు, విద్యార్థి, యువజన, మహిళ, విద్యావేత్తలు, మేధావులు, కవులు, ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

▸▸ ఇరువురు మృతి



జస్వంత్ (ఫైల్)



మోహన్ (ఫైల్)

డోర్నకల్ (మహబూబాబాద్ జిల్లా), ఏప్రిల్ 21 : రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు మృతి చెందిన సంఘటన డోర్నకల్ శివారులో ఆదివారం చోటు చేసుకుంది. డోర్నకల్ సీఐ ఉపేందర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని వెన్నారం గ్రామపంచాయతీ శివారు రామకుంటతండాకు చెందిన తేజావత్ జస్వంత్ నాయక్(23) బంధువు మంగీలాల్‌తో కలిసి డోర్నకల్‌నుంచి వెన్నారంకు వెళ్తున్నారు. అదే సమయంలో ఖమ్మం జిల్లా కాశీరాజుగూడెం ఆరేకోడు తండాకు చెందిన బానోత్ మోహన్(47) భార్య పార్వతి, కూతురు అనూషతో కలిసి ద్విచక్ర వాహనంపై డోర్నకల్ వైపు వస్తున్నారు. ఇండియన్ గ్యాస్ గోదాం వద్దకు రాగానే జస్వంత్ తన ద్విచక్ర వాహనం ముందు వెళ్తున్న ఓ వాహనం ఓవర్‌టెక్ చేసే సమయంలో ఎదురుగా వస్తున్న బానోత్ మోహన్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ఘటనలో జస్వంత్, మంగీలాల్, మోహన్‌లకు తీవ్ర గాయాలు కాగా, పార్వతి, అనూషలు గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు వెంటనే 108 ద్వారా చికిత్స నిమిత్తం మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వారిని పరీక్షించిన వైద్యులు అప్పటికే జస్వంత్ మృతి చెందినట్లు నిర్ధారించారు. బానోత్ మోహన్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మంగీలాల్ పరిస్థితి విషమంగా ఉండడంతో బంధువులు మెరుగైన చికిత్స కోసం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బానోత్ మోహన్ భార్య పార్వతి, కూమార్తె అనూష మహబూబాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాదానికి గురైన రెండు ద్విచక్ర వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఓపెన్ వర్సిటీతో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు

▸▸ వర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ సమ్మయ్య



మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ సమ్మయ్య

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 21 : అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలున్నాయని అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ డి.సమ్మయ్య అన్నారు. ఆదివారం హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీఆర్ అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ స్టడీ సెంటర్ నేతృత్వంలో స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆలువాల సంజీవయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీడీ సమ్మయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అంబేద్కర్ స్టడీ సెంటర్ అందిస్తున్న కోర్సులను సద్వినియోగం చేసుకుని, కష్టపడి చదివి వృద్ధిలోకి వచ్చారని చెప్పారు. విద్యార్థులకు సపోర్టు సర్వీసెస్‌పై మార్గదర్శకం చేశారు. తరగతులను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆలువాల సంజీవయ్య మాట్లాడుతూ.. ఓపెన్ ఎడ్యుకేషన్‌పై విద్యార్థులకు పలు సందేహాలను నివృత్తి చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ శ్రవణ్‌కుమార్, సతీశ్, వేణుమాధవ్, కుమారస్వామి, నవ్య రాణి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి ప్రతినిధి : కావ్య హిందువు కాదనే ప్రచారం ఎందుకు జరుగుతోంది.. అసలు వాస్తవం ఏమిటీ..?

కడియం శ్రీహరి : కావ్య నా కూతురు. నేను షెడ్యూల్ కులానికి చెందిన వ్యక్తిని. నా చదువులు, రాజకీయం మొత్తం ఎస్సీ వ్యక్తిగానే సాగింది. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం తండ్రి కులమే పిల్లలకు వర్తిస్తది. అది తెలియకుండా మాట్లాడుతున్నారు. ఆమె స్పెషల్ మ్యారేజ్ యాక్ట్ కింద వివాహం చేసుకున్నది. ఈ యాక్ట్ ప్రకారం దంపతులు ఎవరి మతాన్ని వారు కొనసాగించుకోవచ్చు. సుప్రీం కోర్టు తీర్పుపై అవగాహన లేకుండా మాట్లాడుతూ ప్రజలను అ యోమయానికి గురి చేస్తున్నారు. వందకు వందశాతం కడియం కావ్య షెడ్యూల్ కులానికి, హిందు మతానికి చెందిన మహిళ.

కాంగ్రెస్‌లో మీరు కొత్త.. మిగతా నేతల నుంచి ఎలాంటి సహకారం లభిస్తోంది..?

కాంగ్రెస్ పార్టీ నుంచి పూర్తి సహకారం లభిస్తోంది. ఎమ్మెల్యేలు, పార్టీ శ్రేణులు కావ్య అభ్యర్థిత్వానికి పూర్తిగా మద్దతుగా నిలుస్తున్నారు. వరంగల్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ బలంగా ఉంది. ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో కాం గ్రెస్ ఎమ్మెల్యేలే ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు భారీగా ఓటింగ్ లభించింది. కార్యకర్తలు కూడా కావ్యను ఎంపీగా లోకసభకు పంపించాలనే లక్ష్యంతో పని చేస్తున్నారు. అందరి సహకారంతో కావ్య మంచి మెజారీతో గెలవబోతున్నారు.

కడియం శ్రీహరిని కొనే దమ్ము ఎవరికీ లేదు!

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

నా రాజకీయ జీవితం తెరిచిన పుస్తకం అని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. డాక్టర్ కడియం కావ్యను వరం గల్ ఎంపీ అభ్యర్థిగా కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించిన తరువాత వరంగల్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో విస్తృతంగా ప్రచారం మొదలు పెట్టామ న్నారు. బూత్ స్థాయి నుంచి మండల స్థాయి, నియోజకవర్గ స్థాయి సమావేశాలు నిర్వహిస్తున్నాం.చౌకబారు, దిగజారుడు విమర్శలు చేయవద్దన్నారు. కడియం శ్రీహరి ఎన్నడు కూడా డబ్బులకు అమ్ముడు పోయే వ్యక్తి కాదు. ఏనాడు కూడా అవినీతి కి, భూ కబ్జాలకు పాల్పడలేదని నా వ్యక్తిగ త్వాన్ని డ్యామేజ్ చేసేందుకు ఇలాంటి ప్రచా రం చేస్తున్నారని తదితర అంశాలపై ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో కడియం ప్రస్తావించారు.

ఆంధ్రజ్యోతి ప్రతినిధి : ఎన్నికల ప్రచారం ఎలా జరుగుతోంది..? ఏలాంటి స్పందన వస్తోంది..?

కడియం శ్రీహరి : డాక్టర్ కడియం కావ్యను వరంగల్ ఎంపీ అభ్యర్థిగా కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించిన తరువాత వరంగల్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో విస్తృతంగా ప్రచారం మొదలు పెట్టాం. బూత్ స్థాయి నుంచి మండల స్థాయి, నియోజకవర్గ స్థాయి సమావేశాలు నిర్వహిస్తున్నాం. సోషల్ మీడియా సమావేశాలు, ప్రతీ రోజు ఉదయం వాకర్స్‌ను కలుసుకుంటున్నాం. ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోంది.

ఆంధ్రజ్యోతి ప్రతినిధి : కూతురు రాజకీయ భవిష్యత్ కోసమే శ్రీహరి పార్టీకి ద్రోహం చేశారని బీఆర్ఎస్ అంటుంది కదా..?

కడియం శ్రీహరి : బీఆర్ఎస్‌కు రాజీనామా చేయడానికి ప్రధాన కారణం పార్టీ సంస్థాగతంగా నిర్మాణం లేకపోవటం.. పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం లేకపోవటమే. అసెంబ్లీ ఎన్నికలకు ముందు, ఆ తరువాత కూడా కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావులకు పార్టీ నిర్మాణం గురించి చెప్పిన పట్టించుకోకపోవటం, అలాగే కడియం కావ్యను ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిన తరువాత బీఆర్ఎస్ నాయకులు ఎవరు కూడా సహకరించకపోవటం, ఒక్క నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని నిర్వహించకపోవటంతో కడియం కావ్య అభ్యర్థిత్వాన్ని వారు వ్యతిరేకిస్తున్నట్లుగా నేను అభిప్రాయపడ్డాను. వాస్తవంగా ఎవరు లేని పరిస్థితుల్లో కడియం కావ్యకు టికెట్ ఇచ్చారు. మొదటి అరూరి రమేష్‌కు టికెట్ ఇవ్వాలని అందరం సూచించాము. అయితే ఆయన టికెట్ నిరాకరించి వేరే పార్టీలోకి వెళ్లి పోయారు. సిట్టింగ్ ఎంపీ దయాకర్‌కు టికెట్ ఇచ్చే విషయంలో కేసీఆర్ ఎందుకో సుముఖంగా లేరు. తాటికొండ రాజయ్య అప్పటికే పార్టీ నుంచి బయటకు వెళ్లిపోయారు. దీంతో ఎవరు లేని పరిస్థితుల్లో కావ్యకు టికెట్ ఇచ్చారు. అయితే వరగంల్ నేతల నుంచి సరైరా సహకారం లేకపోవటం వల్లే నిర్ణయం తీసుకోని బయటకు వెళ్లాల్సి వచ్చింది. పార్టీకి ద్రోహం చేయాలనే ఉద్దేశ్యంతో కాదు.

ఆంధ్రజ్యోతి ప్రతినిధి : పార్టీ ఫండ్ తీసుకుని కాంగ్రెస్‌లోకి జంప్ అయ్యారనే ఆరోపణలపై మీరేమంటారు..?

కడియం శ్రీహరి : కేసీఆర్‌కు భక్తి ఎక్కువ.. దేవుడిపై నమ్మకం కూడా ఎక్కువ.. కడియం కావ్యను అభ్యర్థిగా ప్రకటించి డబ్బులు కూడా ప్రచారం కోసం ఇచ్చామని ఆయన ప్రమాణం చేసి చెప్పినట్లైయితే అభ్యర్థిని విరమించుకోవడానికి సిద్ధంగా ఉన్నాం.. నేను కూడా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. చౌకబారు, దిగజారుడు విమర్శలు చేయవద్దు. కడియం శ్రీహరి ఎన్నడు కూడా డబ్బులకు అమ్ముడు పోయే వ్యక్తి కాదు. ఏనాడు కూడా అవినీతికి పాల్పడ లేదు.. భూ కబ్జాలకు పాల్పడ లేదు. దందాలు చేయలేదు. నా వ్యక్తిగతాన్ని డ్యామేజ్ చేసేందుకు ఇలాంటి ప్రచారం చేస్తున్నారు. ఏ ఆధారం ఉన్నా బయట పెట్టండని బీఆర్ఎస్ నాయకులకు సవాల్ చేస్తున్నాను. నా సవాల్‌ను స్వీకరించకపోతే బీఆర్ఎస్ చేసే విమర్శలు నిరాధారమైనవని ప్రజలు భావిస్తారు.

ఆంధ్రజ్యోతి ప్రతినిధి : కూతురిని నాన్న గెలిపిస్తాడా..?

కడియం శ్రీహరి : కూతురిని నాన్న గెలిపించటం కాదు. కూతురిని ప్రజలు గెలిపించాలి. ప్రజల ఆశీర్వాదం ఉండాలి. కూతురికి నాన్న ఆశీర్వాదం ఉంటుంది. ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాల్లో కడియం శ్రీహరి గురించి ప్రజలకు పూర్తిగా తెలుసు. ఏనాడు భూకబ్జాలకు పాల్పడలేదు. ఏ రకమైన అవినీతికి పాల్పడలేదు. కాంట్రాక్టులు తీసుకోలేదు. నాపై తీవ్రస్థాయిలో విరుచుకపడుతున్న బీఆర్ఎస్ నాయకులు అక్కసుతో, అసహనంతో మాట్లాడుతున్నట్లు కనిపిస్తోంది. నేను ప్రత్యేకంగా దయాకర్‌రావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డికి సవాల్ విసురుతున్నాను. నేనే ఏ రకంగా అవినీతికి పాల్పడ్డట్లు, భూకబ్జాలు, కాంట్రాక్టులు తీసుకున్నట్లు ఏమైనా ఆధారాలు ఉంటే బయట పెట్టండి. నేను ప్రజలకు క్షమాపణలు చెప్పి రాజకీయాల నుంచి తప్పుకుంటాను. దయాకర్‌రావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రభుత్వాన్ని అడ్డు పెట్టుకుని వ్యాపారాలు చేస్తున్నారో.. మెడికల్ కాలేజీలు, యూనివర్సిటీ తెచ్చుకున్నారో ఆధారాలతో చూపిస్తా.. వారు రాజకీయాల నుంచి తప్పుకుంటారా.. నిజంగా నైతికత ఉంటే నా సవాల్‌ను వారు స్వీకరించాలి.. లేదంటే పనికి మాలిన విమర్శలు మానుకోవాలి.

కొరడా ఝులిపిస్తున్న బల్దియా కమిషనర్

▸▸ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు షోకాజు నోటీసులు

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 21 : గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే విధుల్లో అలసత్వం వహించే సిబ్బందిపై కొరడా ఝులిపిస్తున్నారు. బల్దియాలో విధుల్లో చేరినప్పటి నుంచి ప్రతీ శాఖ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ గతంలో మాదిరిగా విధులు నిర్వర్తిస్తే చెల్లదని హెచ్చరిస్తున్నారు. ఇటీవల బాలసముద్రంలోని వెహికిల్ షెడ్ నుంచి డీజిల్ చోరీకి పాల్పడిన ఉద్యోగిపై సస్పెన్షన్ వేటు వేశారు. అక్కడి అధికారులను సైతం హెచ్చరిస్తూ అధికారుల పర్యవేక్షణ లోపించడం వల్లనే దొంగతనాలు జరుగుతున్నాయని, ఇకపై ఏదైనా తప్పు జరిగితే అధికా రులదే బాధ్యత అని హెచ్చరిస్తూ మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్టు తెలిసింది. తాజాగా శనివారం నగరంలో ఆకస్మిక తనిఖీలలో భాగంగా కమిషనర్ శానిటేషన్ ప్రధాన అధికారి డాక్టర్ మల్లం రాజేశ్‌తో కలిసి కాశిబుగ్గ 14వ డివిజన్‌లో పర్యటించారు. ఈ క్రమంలో కమిషన్‌కు చెత్మ, చెదారంలో కూడిన డ్రైనేజీ కనిపించింది. మునిసిపల్ సిబ్బంది ఇటువైపు కూడా చూడడం లేదని, రోడ్లు, డ్రెయినేజీలు శుభ్రం చేయడం లేదని స్థానికులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో సంబంధిత శానిటరి ఇన్‌స్పెక్టర్ ఇశ్రం శ్రీనును పిలిపించి మందలించింది. కమిషనర్ కార్యాలయం నుంచి ఆదివారం సాయంత్రం షోకాజు నోటీసు (మెమో) జారీ చేస్తూ ఉత్తర్వులు అందించారు. జరిగిన తప్పుకు వివరణ ఇవ్వాలని సంబంధిత అధికారులను కోరినట్టు తెలిసింది.

చైల్డ్‌లైన్‌కు ఇద్దరు బాలికల అప్పగింత

గిర్మాజీపేట, ఏప్రిల్ 21 : తల్లి వదిలేసి వెళ్లిన ఇద్దరు బాలికలను వరంగల్ ఆర్‌పీఎఫ్ సిబ్బంది చైల్డ్‌లైన్‌కు అప్పగించిన సంఘటన వరంగల్ రైల్వే స్టేషన్‌లో జరిగింది. ఆదివారం వరంగల్ ఆర్‌పీఎఫ్ సీఐ టీఎస్ఆర్ కృష్ణ విలేఖరులకు తెలిపిన ప్రకారం. శనివారం రాత్రి వరంగల్ రైల్వే స్టేషన్‌లో ఆర్‌పీఎఫ్ ఎస్సై ఎస్.కె.సుభాని, మహిళా కానిస్టేబుల్ కుమారి నీలం మింజి విధి నిర్వహణలో భాగంగా రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేపట్టింది. మొదటి ప్లాట్‌ఫాం వైపు ఉన్న టికెట్ బుకింగ్ కార్యాలయం వద్ద రాత్రి 10.15 గంటల సమయంలో అనుమానాస్పదంగా తొమ్మిది, ఏడు సంవత్సరాల వయస్సు కలిగిన ఇద్దరు బాలికలు ఎస్సై, మహిళా కానిస్టేబుల్‌లకు కనిపించారు. వారి దగ్గరకు వెళ్లి అడుగగా వచ్చిరాని తెలుగులో తమను తల్లి వదిలేసి వెళ్లిపోయిందని, తమది కర్నాటక హుబ్లీ అని చెప్పారు. వెంటనే చిన్నారులను వరంగల్ ఆర్‌పీఎఫ్ ఠానాకు తరలించి చైల్డ్‌లైన్ 1098కు సమాచారమిచ్చి, చిన్నారులకు భోజనం, బిస్కెట్లు అందచేసినట్లు సీఐ తెలిపారు. పిల్లలతో మాట్లాడితే తల్లితో కలిసి నెల రోజుల క్రితం వరంగల్‌లోని అంకుల్ ఇంటికి వచ్చా మని, శనివారం తల్లి తమను రైల్వేస్టేషన్‌లో వదిలివెళ్లినట్లు చెప్పారని సీఐ తెలిపారు. అనంతరం చైల్డ్‌లైన్ ప్రతినిధి మౌనికకు ఇద్దరు చిన్నారులను అప్పగించగా హనుకొండలోని ప్రభుత్వ బాలసదనంలో చేర్పినట్లు సీఐ తెలిపారు.

కార్పొరేట్ సంస్థలకు దేశాన్ని తాకట్టు పెట్టిన మోదీ

▸▸ సమన్యాయం జరగాలంటే రాహుల్ ప్రధాని కావాలి

▸▸ పార్టీ సోషల్ మీడియా సెల్ కీలక పాత్ర పోషించాలి

▸▸ కాంగ్రెస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య

హనుమకొండ సిటీ/వర్ధన్నపేట, ఏప్రిల్ 21: బడా బాబుల కార్పొరేట్ సంస్థలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశాన్ని తాకట్టు పెట్టాడని వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టరు కడియం కావ్య ఆరోపించారు. ఆదివారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో వరంగల్ పార్లమెంట్ స్థాయి సోషల్ మీడియా సమావేశం జరిగింది. టీపీసీసీ సోషల్ మీడియా కార్యదర్శి, వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ ముస్తాక్ నేహాల్, హనుమకొండ జిల్లా ఇన్‌చార్జ్ కేతిడి దీపక్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ తదితర ముఖ్య నేతలతో కలిసి కడియం కావ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పదేళ్ల మోదీ పాలనలో దేశంలో అరాచకాలు, మత విద్వేషాలు పెరిగాయే తప్ప ప్రజాసంక్షేమం, దేశాభివృద్ధి జరగలేదన్నారు.

రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి అవ్వడం ద్వారానే దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతుందని కావ్య అన్నారు. రాహుల్‌ను ప్రధానమంత్రిగా చేసుకునే బాధ్యత అందరిపై ఉందన్నారు. బీజేపీ ప్రచారం చేస్తున్న అబద్ధాలను తిప్పికొట్టడంలో కాంగ్రెస్ సోషల్ మీడియా సెల్ కీలక పాత్ర పోషించాలని కావ్య సూచించారు.

సోషల్ మీడియా శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సూచించారు.



హనుమకొండ జేఎన్ స్టేడియంలో బాక్సింగ్ క్రీడాకారులతో కడియం కావ్య

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన ఆరు గ్యారెంటీలు తోడ్పడ్డాయన్నారు. మేనిఫెస్టోను యువతకు చేరవేస్తే మంచి ఫలితాలు ఉంటాయని వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ సూచించారు.

ప్రచార రథాన్ని ప్రారంభించిన నాయిని, కడియం కావ్య

సమావేశం అనంతరం డీసీసీ భవన్ ఎదుట లోక్‌సభ ఎన్నికల ప్రచార రథాన్ని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి కడియం కావ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, టీపీసీసీ సభ్యులు నమిండ్ల శ్రీనివాస్, బత్తిని శ్రీనివాస్‌రావు, ఈవీ శ్రీనివాస్‌రావు, టీపీసీసీ ఎస్‌సీ సెల్ కో-ఆర్డినేటర్ మోజెస్ ఆనంద్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళ యాదవ్, కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, పోతుల శ్రీమాన్, జక్కుల రవీందర్ యాదవ్, ఇనుగాల రాంప్రసాద్ యాదవ్ పాల్గొన్నారు.

అరూరి ధన బలంతో విర్రవీగుతున్నాడు..

వర్ధన్నపేట సమావేశంలో కడియం కావ్య

బీజేపీ లోక్‌సభ అభ్యర్థి, మాజీఎమ్మెల్యే అరూరి రమేశ్ ధన బలంలో విర్రవీగుతున్నాడని కడియం కావ్య విమర్శించారు. ఆదివారం హనుమకొండ హంటర్ రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే నాగరాజు అధ్యక్షతన వర్ధన్నపేట నియోజకవర్గ సమావేశం జరిగింది. వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, డీసీసీ బ్యాంకు చైర్మన్ మార్నేని రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నసమావేశాన్ని ఉద్దేశించి కడియం కావ్య మాట్లాడారు. భూకబ్జాలు చేసి అరూరి రమేశ్ ప్రజాభిమానాన్ని కోల్పోయాడని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమే ఇందుకు నిదర్శనమన్నారు. ప్రజలు మరోసారి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో ఈ నెల 24న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరంగల్‌కు రాక, సభ నిర్వహణ, నియోజకవర్గం నుంచి శ్రేణుల తరలింపు, ఏర్పాట్లు తదితర అంశాలను ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు చర్చించారు.

అలాగే ఆదివారం ఉదయం మార్నింగ్ వాక్ ప్రచారంలో భాగంగా హనుమకొండ జేఎన్ఎస్‌లో ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, నాగరాజుతో పాటు పార్టీ ముఖ్య నేతలతో కలిసి వాకర్స్, క్రీడాకారులను కడియం కావ్య కలిసి పలకరిస్తూ ముందుకు సాగారు. ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. స్టేడియంలో క్రికెట్ ఆడారు. బాక్సింగ్ గ్లౌజ్ ధరించి పంచ్‌లిచ్చారు. ఇలా ప్రతి ఒక్క క్రీడాకారుడిని కలిసి పరిచయం చేసుకుంటూ ప్రచారంతో సందడి చేశారు.

నేటి నుంచి పుష్‌పుల్ రైలు రద్దు

▸▸ మే 26 వరకు నిలిపివేత..

▸▸ 28 నుంచి మే 22 వరకు కృష్ణ ఎక్స్‌ప్రెస్ దారి మళ్లింపు

గిర్మాజీపేట, ఏప్రిల్ 21 : సికింద్రాబాద్ రైల్వే డివిజన్ పరిధిలో సోమవారం నుంచి వచ్చే నెల 26 వరకు చేపట్టిన రోలింగ్ బ్లాక్ కార్యక్రమంలో భాగంగా వరంగల్ మీదుగా సికింద్రాబాద్, డోర్నకల్‌కు నడిచే పుష్‌పుల్ రైళ్లను దక్షిణ మధ్య రైల్వే రద్దు చేసింది. అలాగే వరంగల్-ఆదిలాబాద్, తిరుపతి వెళ్లు కృష్ణా ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఈ నెల 28 నుంచి వచ్చే నెల 22 వరకు వరంగల్‌కు రాకుండా దారిమళ్లిస్తున్నట్టు దక్షిణ మధ్య రైల్వే ఉత్తర్వులు జారీ చేసింది. రైళ్ల పూర్తి, పాక్షిక రద్దు, దారి మళ్లింపులను దృష్టిలో పెట్టుకుని ప్రయాణాలను చేయాలని దక్షిణ మధ్య రైల్వే ప్రయాణికులను కోరింది. ప్రస్తుతం ప్రతీ రోజు ఉదయం 9 గంటలకు సికిందరాబాద్ నుంచి వరంగల్(07462)కు వచ్చి తిరిగి మధ్యాహ్నం 1.45 గంటలకు వరంగల్ నుంచి హైదరాబాద్(07263) వెళ్లే పుష్‌పుల్ రైళ్లను సోమవారం నుంచి మే 26వ తేదీ వరకు పూర్తిగా రద్దు చేశారు. అలాగే ప్రతీ రోజు ఉదయం 6.30 గంటలకు వరంగల్‌లో బయలుదేరే కాజీపేట-డోర్నకల్ ప్యాసింజర్(07753), రాత్రి డోర్నకల్ నుంచి వరంగల్ మీదుగా కాజిపేట(07754)కు వచ్చే డోర్నకల్-కాజీపేట ప్యాసింజర్ పూర్తిగా రద్దు చేశారు. ప్రతి రోజు నడిచే డోర్నకల్-విజయవాడ(07755), విజయవాడ-డోర్నకల్(07756) ప్యాసింజర్ రైళ్లను కూడా ఈ నెల 29 నుంచి మే 22వ తేదీ వరకు పూర్తిగా రద్దు చేశారు.

28 నుంచి వరంగల్‌కు రాని కృష్ణ ఎక్స్‌ప్రెస్

ఈ నెల 28 నుంచి మే 10, మే 15 నుంచి మే 22వ తేదీ వరకు కృష్ణ ఎక్స్‌ప్రెస్ వరంగల్‌కు రాదు. వరంగల్ మీదుగా ఆదిలాబాద్-తిరుపతి మధ్య నడుస్తున్న కృష్ణ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఈ నెల 28 నుంచి మే 10 వరకు, మే 15 నుంచి 22 వరకు వరంగల్ రాకుండా దారిమళ్లించారు. 28 నుంచి మే 9 వరకు, మే 15 నుంచి మే 21 వరకు ఆదిలాబాద్ నుంచి తిరుపతి వెళ్లు కృష్ణ ఎక్స్‌ప్రెస్ సికింద్రాబాద్ నుంచి పగిడిపల్లి, గుంటూరు, తెనాలి, గూడూరు మీదుగా తిరుపతి చేరుకుంటుంది. ఈనెల 29 నుంచి మే10, మే 16 నుంచి మే 22 వరకు తిరుపతి నుంచి కృష్ణ ఎక్స్‌ప్రెస్ గూడూరు, తెనాలి, గుంటూరు, పగిడిపల్లి మీదుగా సికింద్రాబాద్ చేరుకుని ఆదిలాబాద్ వెళ్తుందని అధికారులు తెలిపారు. మే 3, 4 తేదీల్లో సికింద్రాబాద్-సిర్పూర్ కాగజ్‌నగర్ భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్‌ను కాజీపేట-సికింద్రాబాద్ మధ్య పాక్షికంగా రద్దు చేసినట్లు రైల్వే శాఖ పేర్కొంది.

గంజాయితో పట్టుబడిన యువకులు

▸▸ వివరాలు వెల్లడించిన ఏసీపీ దేవేందర్‌రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 21: గంజాయి సేవిస్తూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన నలుగురు యువకులను అరెస్టు చేసి ఆదివారం రిమాండ్‌కు తరలించినట్లు హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పద్మాక్షికాలనీ శ్మశానవాటికలో యువకులు గంజాయి సేవిస్తున్నారని పక్కా సమాచారం రావడంతో శనివారం మధ్యాహ్నం ఎస్సై శ్రీనివాస్ సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లారు. ఆసమయంలో ఆత్మకూరు మండలం పెంచికలపేట గ్రామానికి చెందిన జంగం వంశీకృష్ణ, చిల్పూర్ మండలం వంగాలపల్లి గ్రామానికి చెందిన అరూరి వంశీ, పద్మాక్షికాలనీ ఆనంద్‌నగర్‌కు చెందిన ఐత శివ, పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన బుగ్గ నవీన్‌లు గంజాయి సేవిస్తూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. నిందితుల నుంచి సుమారు రూ.30వేల విలువ చేసే 2 కిలోల గంజాయితో పాటు రెండు ద్విచక్ర వాహనాలు, నాలుగు సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. కాగా, నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన ఇన్‌స్పెక్టర్ వై.సతీష్, ఎస్సైలు శ్రీనివాస్, పరుశురాములు, హెడ్‌కానిస్టేబుల్ రవీందర్‌రెడ్డి, అశోక్, కానిస్టేబుల్ కిరణ్‌ను ఏసీపీ అభినందించారు.

వ్యవసాయ కోర్సులకు 'ఐకార్' నోటిఫికేషన్ విడుదల

వరంగల్ వ్యవసాయం, ఏప్రిల్ 21 : వ్యవసాయ సంబంధిత పీజీ కోర్సుల్లో 2024-25 విద్యా సంవత్సరం అడ్మిషన్ల కోసం ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఆలిండి యా ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ ఫర్ అడ్మిషన్(ఐకార్ ఏఐఈఈఏ పీజీ) 2024 నోటిఫికేష న్ ఇటీవల విడుదల చేసింది. ఈ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నిర్వహిస్తోంది. పరీక్షల్లో సాధించిన ప్రతిభ ఆధారంగా దేశ వ్యాప్తంగా ఉన్న 74 వ్యవసాయ విశ్వవిద్యాలయాలు అందిస్తున్న కోర్సుల్లో ప్రత్యేకించిన సీట్లలో ప్రవేశాలు కల్పిస్తారు.

విభాగాల కోర్సులు

ప్లాంట్ బయోటెక్నాలజీ, ప్లాంట్‌సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్, ఎంటమాలజీ అండ్ నెమటాలజీ, అగ్రోనమీ, సోషల్ సైన్సెస్, స్టాటికల్ సైన్సెస్, హార్టికల్చర్, ఫారెస్ట్రీ, కమ్యూనిటీ సైన్స్, యానిమల్ బయోటెక్నాలజీ, వెటర్నరీ సైన్స్, యానిమల్ సైన్సెస్, ఫిషరీస్ సైన్స్, డైయిరీ సైన్స్, డైయిరీ టెక్నాలజీ, అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్, వాటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ.

అర్హత

సంబంధిత విభాగంలో బీఎస్సీ, బీటెక్, బీవీఎస్సీ, బీఎఫ్ఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానంలో మల్టీపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో మే 11 వరకు దరఖాస్తులు చేసుకోవాలి. పరీక్ష జూన్ 29న నిర్వహిస్తారు. హైదరాబాద్/సికింద్రాబాద్/రంగారెడ్డి, కరీంనగర్, వరంగల్‌లో పరీక్ష కేంద్రాలున్నాయి. పూర్తి వివరాలకు www.exams.nta.ac.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలి.

పరిమళించిన మానవత్వం

- ఉపాధ్యాయుడి మృతికి చలించిన యాజమాన్యం
- కుటుంబానికి రూ. 5 లక్షల ఆర్థిక సాయం
- ఔదార్యాన్ని చాటుకున్న సెయింట్ పాల్స్ పాఠశాల



గణేష్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న సెయింట్ పాల్స్ హెచ్ఎం రెవరెండ్ ఫాదర్ ఎస్.మరియ జోసఫ్

జనగామ కల్చరల్, ఏప్రిల్ 21: జనగామ సెయింట్ పాల్స్ హైస్కూల్ ఉపాధ్యాయుడు గణేశ్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై పాఠశాల యాజమాన్యం స్పందించింది. ఆయన కుటుంబాన్ని ఆదుకునేందుకు ముందుకొచ్చింది. తన వంతు సాయంగా రూ.2లక్షలు ఆర్థిక సాయం ప్రకటించగా అదే పాఠశాలలో పనిచేసిన సహచర ఉపాధ్యాయులు మరో రూ.3లక్షలు కలిపి మొత్తంగా రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యుల పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసినట్లు ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ ఎస్.మరియ జోసఫ్ తెలిపారు. అదేవిధంగా గణేష్ భార్య గాయత్రికి పాఠశాలలో ఉద్యోగం కల్పించడంతో పాటు పిల్లలు లక్ష్మీప్రసన్న, మౌలిక్, ఆదిత్యలకు ఉచిత విద్య అందించేందుకు వరంగల్ పీఠాధిపతి బిషప్ ఉడుముల బాల చొరవతీసు కోవడంపట్ల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్ఎస్ కోఆర్డినేటర్‌గా జనగామ యాదగిరి



చిలుపూర్, ఏప్రిల్ 21: బీఆర్ఎస్ పార్టీ చిలుపూర్ మండల కోఆర్డినేటర్‌గా మండలంలోని చిన్నపెండ్యాలకు చెందిన జనగామ యాదగిరి నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా జనగామ యాదగిరి మాట్లాడుతూ, తనపై నమ్మకంతో మండల కోఆర్డినేటర్‌గా నియమించిన మాజీ ఎమ్మెల్యే రాజయ్యకు, సహకరించిన జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కాగా, ఇంతకుముందున్న పార్టీ మండలాధ్యక్షుడు భూక్య రమేష్‌నాయక్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి వెంట కాంగ్రెస్ పార్టీలోకి వెళ్ళడంతో బీఆర్ఎస్ పార్టీ యాదగిరిని కోఆర్డినేటర్‌గా నియమించింది.

అదేవిధంగా చిలుపూర్ మండల బీఆర్ఎస్ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలుగా కృష్ణాజీగూడెం గ్రామానికి చెందిన పోలు రమను నియమించినట్లు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య ప్రకటించారు.

ఆపదలో ఉన్న వ్యక్తికి బాల్యమిత్రుల చేయూత



స్నేహితుడికి ఆర్థికసాయాన్ని అందజేస్తున్న బాల్యమిత్రులు

లింగాలఘణపురం, ఏప్రిల్ 21: మండలంలోని వడిచర్లకు చెందిన ఎండి యాకూబ్ అనే యువకుడు కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా 1997-98 ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన తన బాల్యమిత్రులు ఆదివారం రూ.33వేల ఆర్థిక సాయం చేసి అండగా నిలిచారు. యాకూబ్ రెండుమాసాలుగా తీవ్ర అనారోగ్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ సమాచారం తెల్సుకున్న బాల్యమిత్రులు బొల్లంపల్లి వెంకటేశ్వర్లు, షైదం సత్యనారాయణ, ఆర్.కిరణ్‌కుమార్, దూసరి రాజు, జనగాం శంకర్, బోయిని ఉపేందర్, ఎండి జావీద్, పద్మ, వరలక్ష్మి శారద, జ్యోతి తదితరులు స్పందించి తమవంతుగా ఆర్థికం సాయం చేశారు.

ఊరూరా కాంగ్రెస్ సమావేశాలు



ఇప్పగూడెంలో సమావేశమైన కాంగ్రెస్ శ్రేణులు

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 21: వరంగల్ లోకసభ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య గెలుపును కాంక్షిస్తూ సమన్వయకమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం ఊరూరా కాంగ్రెస్ కార్యకర్తలు బూత్‌స్థాయి సమావేశాలు నిర్వహించారు. ఇప్పగూడెం, అక్కపల్లిగూడెం, సముద్రాల, రంగరాయగూడెం, కోమటీగూడెం గ్రామాల్లో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు బెలిదె వెంకన్న పాల్గొన్నారు. గ్రామాల వారీగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి, టీపీసీసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సింగపురం ఇందిర వర్గాలకు చెందిన 40మంది సభ్యులతో బూత్ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ కావ్య భారీ మెజార్టీతో గెలువబోతోందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జూలకుంట్ల శిరీష్ రెడ్డి, కత్తుల కట్టయ్య, దయాకర్, తోట వెంకన్న, కుందూరు శ్రీనివాస్ రెడ్డి, సింగపురం వెంకటయ్య, పోగుల సారంగపాణి, కాసాని బొందయ్య, గొడుగు రాజు, పల్లె రవీందర్, బూర్ల శంకర్, అజయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లింగాలఘణపురం: కడియం కావ్య గెలుపును కాంక్షిస్తూ ఆదివారం ఊరూరా కాంగ్రెస్ కార్యకర్తలు సమావేశాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఇటీవల బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన కార్యకర్తలను కాంగ్రెస్ పూర్వ కార్యకర్తల మధ్య సమన్వయం కుదిర్చే ప్రయత్నాలు మండల సమన్వయ కమిటీ శరవేగంగా చేపడుతోంది. ఈనేపథ్యంలో కొత్త పాత అనే తేడా లేకుండా సమష్టిగా కలిసి పనిచేసి కడియం కావ్యను గెలిపించాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు కొల్లూరు శివ, నాయకులు పోరెడ్డి మల్లారెడ్డి, కీసర దిలీప్‌రెడ్డి, బిట్ల బాబు, బూడిది సదానందం, నీలం మోహన్, సాదం విజయమనోహర్, దూసరి గణపతి, చిటుకుల వెంకటేశ్వర్లు, కడారు కృష్ణ, చిట్ల భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

చిలుపూర్: కడియం కావ్య గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు, ఎన్నికల సమన్వయకర్త గడ్డమీది సురేశ్ అన్నారు. ఆదివారం ఫతేపూర్, దేశాయితండా తదితర గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి నేతృత్వంలో నియోజకవర్గం మరింతగా అభివృద్ధి కానుందని ధీమా వ్యక్తం చేశారు. వరంగల్ ఎంపీగా కడియం కావ్య అభ్యర్థిత్వాన్ని ప్రతీఒక్కరూ బలపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మామిడాల లింగారెడ్డి, పోలేపల్లి రంజిత్‌రెడ్డి, భూక్య రమేష్‌నాయక్, తీగల మహేందర్, బొమ్మిశెట్టి బాలరాజు, కొయ్యడ రాందాస్, గొంగిడి కృష్ణమూర్తి, పాశం సురేశ్, గుగులోతు ఉమ్లానాయక్, ఏదునూరి రవిందర్, జంగిటి ప్రభాకర్, గాజుల రజిని, కండ్లకోలు బాలరాజు, మర్రి దుర్గాప్రసాద్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్



దేవరుప్పులలో మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్

దేవరుప్పుల, ఏప్రిల్ 21: కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కడియం శ్రీహరి మాటల్లో తప్ప చేతల్లో నీతి ఉండదని, మాదిగ నేతలను రాజకీయంగా ఎదుగకుండా కుట్ర చేశాడని విమర్శించారు. నరేంద్ర మోదీ మరోసారి అధికారంలోకి వస్తే దేశ ఆర్థిక భద్రతే లక్ష్యంగా పనిచేస్తారన్నారు. కార్యకర్తలకు తాను ఎల్లప్పుడు అందుబాటులో ఉండి వారి కష్టసుఖాల్లో పాలు పంచుకుంటానన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, బీజేపీ అధికారంలోకి రావాల్సిన అవసరాన్ని ప్రజలకు తెలియజేయాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు లేగ రామ్మోహన్‌రెడ్డి, దుబ్బ రాజశేఖర్, దొంగరి మహేందర్, పూసాల శ్రీమాన్, చింత సృజన్‌కుమార్, కాసాని సత్తయ్య, రాజోజు నర్సింహాచారి, శివకుమార్, రామగిరి గణేష్, భాస్కర్, అన్వేష్, రమేష్, నాగరాజు, బ్రహ్మాచారి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలపై అవగాహన



ముత్తారంలో గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

పాలకుర్తి, ఏప్రిల్ 21: ఎన్నికల నిబంధనలను తప్పకుండా పాటించాలని పాలకుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మహేందర్‌రెడ్డి సూచించారు. ఆదివారం ఆయన ముత్తారం, తొర్రూరు, శాతాపురం గ్రామాలను సందర్శించి ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పించారు. పార్లమెంటు ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రతీ ఒక్కరు సహకరించాలని అన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. ఆయన వెంట పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల ఎస్సైలు ప్రసన్నకుమార్, చెన్నకేశవులు, శ్రావన్‌కుమార్ ఉన్నారు.

కొడకండ్ల: మండలంలోని నర్సింగాపురం గ్రామంలో పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు సైకిళ్ళపై వెళ్ళి ప్రజలకు ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనాలపై వెళ్తే కచ్చితంగా హెల్మెట్ ధరించాలని, కారులో వెళితే సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. ప్రతీ వాహనానికి నిబంధనల ప్రకారం వెనుక ముందు నెంబర్ ఉండాలని తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్ గురించి చెబుతూ మత్తు పానీయాలు సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. మైనర్‌లకు వాహనాలు ఇవ్వవద్దని హెచ్చరించారు. సీఐతో పాటు కొడకండ్ల, దేవరుప్పుల ఎస్ఐలు శ్రవణ్‌కుమార్, చెన్న కేశవులు పాల్గొన్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం

చిలుపూర్, ఏప్రిల్ 21: గత పదేళ్ళుగా దేశంలో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికీ వివరించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గంటె ఉపేందర్ యాదవ్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన నష్కల్, వెంకటాద్రిపేట, వంగాలపల్లి, ఫతేపూర్, చిలుపూర్ తదితర గ్రామాల్లో వరంగల్ ఎంపీ అభ్యర్థి ఆరూరి రమేష్‌కు మద్ధతుగా ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గడిచిన పది సంవత్సరాలుగా నిరుపేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా అహర్నిశలు పాటుపడుతున్న బీజేపీకి అన్నివర్గాల ప్రజలు అండగా నిలవాలని కోరారు. వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థి ఆరూరి రమేష్ విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం మండలంలోని వెంకటేశ్వర్లపల్లి గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన 50 మంది యువకులు బీజేపీలో చేరగా, వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో తోకల సంపత్‌రెడ్డి, గుగులోతు మధునాయక్, తాళ్ళపల్లి లింగమూర్తి, తోట శ్రీనివాస్, బాల్నె శ్రీనివాస్, ఊరడి రాజు, సాదం రామరాజు, దోరం శ్రీనివాస్, సాదం భీమన్న, కాదుకాయ రమేష్, వెలిశాల శ్రీనివాస్, కందుకూరి రజనీకర్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన



అడవికేశ్వాపురంలో రైతులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ రోహిత్‌సింగ్

జనగామ కల్చరల్, ఏప్రిల్ 21: జనగామ మండలం అడవి కేశ్వాపురం, నర్మెట మండలం బొమ్మకూరు, హన్మంతాపురంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను అడిషనల్ కలెక్టర్ రోహిత్‌సింగ్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అకాల వర్షం కారణంగా ఎక్కడైనా ధాన్యం తడిస్తే ప్రభుత్వం మద్దతు ధరకే కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. కొనుగోలు కేంద్రాల వద్దనే ధాన్యాన్ని అమ్ముకొని మద్దతు ధర పొందాలన్నారు. సరిపడా టార్పాలిన్లు, లారీలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. ధాన్యం కాంటా అవ్వగానే ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించాలని, ఎలాంటి నిర్లక్ష్యం చేయరాదని అన్నారు.

అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తాం

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 21: పార్టీలకు అతీతంగా నెమలిగొండలో భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ఎంపీటీసీ పురమాని రజాక్‌యాదవ్ అన్నారు. ఈ విషయమై ఆదివారం గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో ఎక్కడాలేని విధంగా అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. అన్ని పార్టీలకు చెందిన నాయకుల సమష్టి కృషితోనే విగ్రహం ఏర్పాటు చేయడంతో పాటు ఆవిష్కరణ ఉత్సవాలను నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు గాదె శ్రీధర్, మోటం ప్రభాకర్, గాదె రాజు, శ్రీనివాస్, హరికృష్ణ, గాదె రాకేష్, చందు పాల్గొన్నారు.

నేటి నుంచి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



ఉత్సవాలకు ముస్తాబైన శ్రీఉమానీలకంఠ ఆలయం

జఫర్‌గఢ్, ఏప్రిల్ 21: మండల కేంద్రంలోని శ్రీఉమానీలకంఠ పరమేశ్వర స్వామి దేవాలయం (శివాలయం)లో సోమవారం నుంచి ధ్వజ స్తంభ పునఃప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభమవుతున్నాయి. ఆలయంలోని ధ్వజస్తంభం శిథిలావస్థకు చేరడంతో హైద్రాబాద్ వాస్తవ్యులు దాత డోలి అన్సి మాధవ్ దంపతులు, ప్రజల ఆర్థిక సహకారంతో నూతనంగా సుమారు 27 పీట్ల ఎత్తు గల ఒకే శిలతో రాతి ధ్వజస్తంభాన్ని తయారు చేయించారు. ఈ నేపథ్యంలో ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపనకు గాను సోమవారం నుంచి బుధవారం వరకు పెద్ద ఎత్తున ఉత్సవాలను నిర్వహించేందుకు ఆలయాల అభివృద్ధి కమిటి ప్రతినిధులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

24న ధ్వజస్తంభం ప్రతిష్ఠ- శివ కల్యాణం...

శివాలయంలో 22న సోమవారం గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాసన, యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ఠాపన, జలాధివాసం, అధివాసంగ హోమములు వంటి పూజలు, 23 మంగళవారం మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, హారతి మంత్రపుష్పం, 24 బుధవారం దేవత పూజలు, హోమములు, ధాతు, బీజన్యాసం, యంత్ర, ధ్వజస్తంభ ప్రతిష్ఠతో పాటు శివ కల్యాణం, వంటి విశిష్ట పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆలయాన్ని రంగులు, విద్యుద్దీపాలంకరణలతో సుందరంగా తీర్చిదిద్దారు. ప్రధాన వీధుల్లో మైకులు, లైటింగ్ సిస్టం ఏర్పాటు చేశారు. వేసవి దృష్ట్యా ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నీడ, తాగునీటి వసతితో పాటు ఉచిత భోజన సదుపాయాలను కల్పిస్తున్నట్లు కమిటి ప్రతినిధులు తెలిపారు.

ఉత్సవాల విజయవంతానికి భక్తులు, గ్రామస్తులందరూ సహకరించాలని కమిటి అధ్యక్షుడు మంచాల ఎల్లయ్య, గౌరవ అధ్యక్షుడు అన్నెబోయిన భిక్షపతి, ప్రధాన కార్యదర్శి కన్న సోమశేఖర్, ఉపాధ్యక్షుడు తాటికాయల యాకయ్య, కార్యదర్శి జ్యోతి యాకయ్య, సహాయ కార్యదర్శి సింగారపు రమేశ్, బైరి రవి, ప్రతినిధులు కోరారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఇంటర్ 1988-90 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

జనగామ కల్చరల్, ఏప్రిల్ 21: జిల్లా కేంద్రంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఆదివారం జనగామ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల 1988-90 ఇంటర్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి పూర్వ గురువు ఎన్.సంజీవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మూడున్నర దశాబ్దాల తరువాత పూర్వ విద్యార్థులు కలుసుకొని మధుర ఘట్టాలను నెమరువేసుకున్నారు. ఇంటర్ కీలక విద్యను సద్వినియోగం చేసుకున్న ప్రతీ విద్యార్థి భవిష్యత్తులో ఆశించిన రంగాలలో అగ్రభాగాన నిలుస్తారన్నారు. అనంతరం సంజీవరెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాచర్ల బిక్షపతి - స్వరూప దంపతులను సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

వరంగల్ స్థానం బీఆర్ఎస్‌దే..

- హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్



మాట్లాడుతున్న వినయభాస్కర్

రాంనగర్, ఏప్రిల్ 21: వరంగల్ పార్లమెంట్ స్థానాన్ని బీఆర్ఎస్ కైవసం చేసుకుంటుందని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం హనుమకొండలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. వరంగల్ ఎంపీగా బరిలో నిలిచిన బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్ మచ్చలేని మని షని భారీ మెజారిటీతో విజయం సాధిస్తారని తెలిపారు. 10 ఏళ్లలో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణకు చేసింది ఏమిలేదన్నారు. విభజన హామీలు నెరవేర్చలేదన్నారు. బీజేపీ, కాం గ్రెస్ నుంచి బరిలో నిలిచిన అభ్యర్థులు బీఆర్ఎస్‌కు మోసం చేసినవారన్నారు. అవకాశాల కోసం బీఆర్ ఎస్‌కు ద్రోహం చేసి పార్టీ మారారని ఆరోపించారు. ఎమ్మెల్సీ బండా ప్రకాశ్ మాట్లాడుతూ.. కడియం పార్టీ మారడంతో బీఆర్ఎస్ మొదటి స్థానంలోకి వెళ్లిందని ఆయన మూడో స్థానంలోకి వెళ్లారని ఆరోపించారు.

అభ్యర్థి మారపెల్లి సుధీర్‌కుమార్ మాట్లా డుతూ.. బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ భూ కబ్జాదా రుడన్నారు. ఎమ్మెల్యేగా వర్ధన్నపేట నియోజకవర్గం చుట్టూ ఉన్న భూములు ఆక్రమించాడని ఆరోపించారు. కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య చిలుకపలు కులు పలుకుతుందని, ఆమెకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని ఆయన ఆరోపించారు. తనకు అవకాశం ఇస్తే ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని సుధీర్‌కుమార్ హామీ ఇచ్చారు. విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, మాజీ 'కుడా' చైర్మన్‌లు మర్రి యాద వరెడ్డి, సంగంరెడ్డి సుందర్‌రాజ్ పాల్గొన్నారు.

నేడు సుధీర్‌కుమార్ నామినేషన్

బీఆర్ఎస్ అభ్యర్థి మారపెల్లి సుధీర్‌కుమార్ సోమవారం ఉదయం 11గంటలకు నామినేషన్ దాఖలు చేయనున్నారు. బీఆర్ఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలతో కలిసి వరంగల్ కలెక్టరేట్‌లో సుధీర్‌కుమార్ నామినేషన్ దాఖలు చేయనున్నారు. కాగా, ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 23న జిల్లాకు రాను న్నారు. 23 సాయంత్రం 5గంటలకు హంటర్ రోడ్డులోని నాని గార్డెన్స్‌లో నిర్వహించే తూర్పు నియోజకవర్గ పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. అనంతరం సాయంత్రం 6గంటలకు హంటర్‌రోడ్డులోని డీ కన్వెన్షన్‌లో జరిగే వర్ధన్నపేట నియోజకవర్గం పార్టీ సమావేశంలో కేటీఆర్ పాల్గొననున్నట్లు హనుమకొండ జిల్లా పార్టీ అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ తెలిపారు.

కోడ్ ఉల్లంఘిస్తే... విజిలేయండి!

(5వ పేజీ తరువాయి)

మత్తు పదార్థాల పంపిణీ, రెచ్చగొట్టే ప్రసంగాలు, ఉచితాలు, బహుమతుల అందజేత, తప్పుడు వార్తల ప్రచారం, ఓటర్లను ప్రభావితం చేసేందుకు ఎన్నికల రోజు వారిని వాహనాల్లో తరలించడం, ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది ఎన్నికల ప్రచారాల్లో పాల్గొనడం వంటి అంశాలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చు. ఇలాంటి ఉల్లంఘనలను ఫొటో, వీడియో, ఆడియో రూపాల్లో రికార్డ్ చేసి అప్‌లోడ్ చేయవచ్చు. ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయడానికి ఎక్కడో సుదూర ప్రాంతాల్లో ఉన్న ఏ కార్యాలయానికో ప్రజలు వెళ్లాల్సిన అవసరం లేదు. ఎక్కడైతే అక్రమాలు కనిపించాయో.. అక్కడి నుంచే యాప్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చు.

100 నిమిషాల్లో చర్యలు...

యాప్‌లో ఫిర్యాదు చేసిన ఐదు నిమిషాల్లో జిల్లా ఎన్నికల విభాగం నుంచి క్షేత్ర స్థాయి అధికారులకు పంపుతారు. వారు 15 నిమిషాల్లో ఘటనా స్థలానికి చేరుకుంటారు. విచారించి.. 30 నిమిషాల్లో వివరాలను సేకరిస్తారు. అనంతరం జిల్లా ఎన్నికల అధికారికి నివేదిస్తారు. ఆయన దానిపై 50 నిమిషాల్లో చర్యలు తీసుకుంటారు. ఇలా 100 నిమిషాల్లో సీ-విజిల్ యాప్ ద్వారా చేసిన ఫిర్యాదుపై చర్యలు తీసుకుంటారు. చేసిన ఫిర్యాదు స్టేటస్ కూడా తెలుసుకోవచ్చు.

పక్కాగా.. పకడ్బందీగా...

సీ-విజిల్ యాప్ దుర్వినియోగం కాకుండా ఎన్నికల సంఘం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంది. ఎన్నికలు జరుగుతున్న రాష్ట్ర భౌగోళిక సరిహద్దుల మధ్య మాత్రమే ఇది ఉపయోగపడుతుంది. ముందస్తుగా నమోదు చేసిన వీడియోలు, ఫోటోలను స్వీకరించదు. యాప్‌లో ఉన్న డేటా గ్యాలరీలో సేవ్ చేయడానికి వీలు కాదు. వ్యక్తిగత, తప్పుడు ఫిర్యాదును గుర్తిస్తే పక్కన పెట్టేస్తారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన వివరాలను తెలుసుకునేందుకు ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఇతర వివరాలకు టోల్ ఫ్రీ నంబరు 1950 ని కూడా సంప్రదించవచ్చు.

భక్తి శ్రద్ధలతో హనుమాన్ మాలధారణ



మాలధారణ చేసుకున్న హనుమాన్ స్వాములు

కొడకండ్ల ఏప్రిల్ 21: మండలకేంద్రానికి చెందిన హనుమాన్ భక్తులు స్థానిక రామాలయంలో ఆదివారం అర్ధమండల హనుమాన్ మాలధారణ కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితులు పిండిపోలు మౌర్య, నాగ దక్షిణా మూర్తిల ఆధ్వర్యంలో పెట్లోజు నాగరాజు, అజయ్ , నవీన్, ఉపేందర్, తదితరులకు మాలధారణ చేశారు. అనంతరం హనుమాన్ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి చందనాభిషేకం చేసి తీర్థ ప్రసాద వితరణ చేశారు.

వల్మిడి దేవస్థానంలో ఘనంగా పూర్ణాహుతి



పూర్ణాహుతి కార్యక్రమాన్ని చేస్తున్న పూజారులు

పాలకుర్తి, ఏప్రిల్ 21: మండలంలోని వల్మిడి సీత రామచంద్రస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా పూర్ణాహుతి కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయం పూజారుల మంత్రోచ్ఛారణల మధ్య పూర్ణాహుతి కార్యక్రమాన్ని దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారుల అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించగా భక్తులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, పూజారులు, సిబ్బంది పాల్గొన్నారు.